"ఏం తాతా! ఎందుకు ఇన్ని కట్టె పుల్లలు పోగుచేస్తున్నావు?"

"నేను ఎప్పుడైనా నర్మదా నది దాటి కాశీకి వెళ్ళాలనుకున్నప్పుడు వంతెనని కట్టుకోడానికి." జవాబు చెప్పేవాడతను.

వారా సమాధానానికి పక పకా నవ్వితే ఆయనా అలాగే నవ్వేవాడు. "నన్ను చూసి ఎందుకలా నవ్వావు?" అని వారు అడగకుండా ఉండలేకపోయేవారు.

అప్పుడు అయన చెప్పే సమాధానం ఇది.

"మీరు ఖర్చు చేయలేనంత ధనాన్ని, ఎప్పటికైనా ఖర్చుకి పనికి వస్తుందని ఎలా పోగుచేసుకుంటున్నారో, నేనూ అలాగే ఎన్నడూ కట్టని వంతెన కోసం కట్టె పుల్లలని పోగుచేసుకుంటున్నాను." పాఠం నేర్పించాడు అతను.

## 146. మతాన్ని గౌరవించడం ఎలా?

ఓ భారతీయ సాధువుని జర్మనీకి ఆహ్వానించారు. బెర్లిన్‌లోని ఓ పెద్ద చర్చిలో అతను తన ప్రవచనాన్ని మొదలెట్టబోయే ముందు ఒకరు ఓ చీటి మీద తన అనుమానాన్ని రాసి పంపించాడు. దాన్ని బయటకి బిగ్గరగా చదివాడు ఆ సాధువు.

"భారత దేశంలోని హిందూమతం అహింసా తత్వాన్ని బోధిస్తోంది కదా. మరి అక్కడ పుట్టిన గాంధి దాన్ని బాగా ఆకళింపు చేసుకుని దాన్ని అనుసరిస్తే, అక్కడే పుట్టిన గాడ్సే గాంధీని ఎందుకు హత్య చేసాడు?"

కొద్దిసేపు మౌనంగా ఉన్నాక ఆ సాధువు ఆ ప్రశ్నకి ఇలా జవాబు చెప్పాడు.

" నేను ఓ రోజు భారత దేశంలోని ఋషికేష్‌లోని మా ఆశ్రమంలోంచి గంగానది ఒడ్డుకి వెళ్ళి కొద్దిసేపు అక్కడ కూర్చున్నాను. తర్వాత నదిలోకి

దిగితే అడుగున ఓ పెద్ద రాయి కనిపించింది. దాన్ని నేను బయటకి తీస్తే తడిసి ఉందది. దాని తడి ఎంతలోతుగా ఉందో తెలుసుకుందామని నేనా రాయిని బద్దలు కొట్టి చూస్తే లోపలంతా పొడిగా ఉంది తప్ప ఎంతో కాలంగా అది నీటి మధ్య ఉన్నా నీరు దాన్లోకి చొచ్చుకుపోలేక పోయింది. అలాగే కొన్ని శతాబ్దాలుగా యూరప్‌లో క్రిస్టియానిటీ ఉన్నా, ఇక్కడ నివసించే వారిలోకి క్రిస్టియానిటీ చొచ్చుకుపోయి, వాళ్ళల్లో అది నివసించడం లేదు. దాంతో ఇక్కడ రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. గాడ్సే విషయంలో కూడా ఇదే జరిగింది. మనం స్పాంజ్‌లా జీవించాలి తప్ప బండరాయిలా కాదు. అదే ఎవరైనా తమ మతాన్ని గౌరవించే విధానం.”

## 147. మార్పు

ఓ గ్రామంలో నివసించే ఒకామెకి పండరీపురానికి కాలి నడకన వెళ్ళి పండరీ నాథుడికి పూజలు చేస్తే, తమ కుటుంబానికి మంచి జరుగుతుందని తెలిసింది. ఇరుగు పొరుగు అక్కడికి వెళ్తూండటంతో ఆమె కూడా పండరీపురానికి వాళ్ళ వెంట వెళ్ళడానికి నిశ్చయించుకుంది.

“నన్ను ఒంటరిగా వదిలి వెళ్తున్నావు. నా సంగతి ఎవరు చూస్తారు?” కొపంగా అడిగాడు భర్త.

“పన్నెండు రోజులేగా. ఎలాగో సర్దుకోండి.” జవాబు చెప్పింది ఆమె.

దారిలో తినడానికి కొన్ని రొట్టెలు చేసుకుని కాలి నడకన బయలుదేరింది. పాండురంగడికి అర్చన చేసి చెప్పిన టైంకి తన గ్రామానికి వచ్చేసింది. తిరిగి వచ్చిన ఆమెని ఎగాదిగా చూసి అడిగాడు భర్త.

“నీలో ఏదో గొప్ప మార్పు కనిపిస్తోంది. ఏమిటది?”

“ఏమో మరి? నాకు తెలీదు.” జవాబు చెప్పిందామె.

కొన్నేళ్ళుగా కాళ్ళు చచ్చుబడి, మంచం దిగలేని స్థితిలో ఉన్న తన